అందరి పిల్లలూ తన వాళ్ళేనని పరపతి నుపయోగించి ప్రయోకుల్ని చేసినా శక్తి కొద్దీ పాటుపడి ఆత్మ తృప్తిని మిగుల్చుకున్నా కనీసం కృతజ్ఞత కూడా వాళ్ళ నుంచి ఆశించక పోయినా ఆ కృతజ్ఞత ఏనాటికైనా మిగిలి వుండి తమకు అన్నం పెడుతుందేమోనని అనాధలుగా చూస్తున్న పిల్లలు కన్పిస్తున్నారు....

కన్పించటంలేదు.

విసురుగా తలుపులు తెరుచుకున్నాయి.

"అసలీ డాక్టరున్నాడా లేడా గుమ్మంకాడింత గోల జరుగుతావుంటే నిమ్మకు నీరెత్తినట్టు పడుకున్నాడా? ఈడ్చించి బదిలీ సేయించి పారేత్తా"

అహంకారం మృగంలా మొరుగుతోంది.

మంచి తనం దేవతలా అదృశ్యమైంది.

అనుమానంతో శంకరయ్య, సిస్టరూ డాక్టర్ రూమ్‌లోకి అడుగు పెట్టారు.

"..... ..... ....."

"ఏందయ్యా..ఎల్లినోల్లేమయ్యారూ? ఆ డాక్టరసలు మడిసేనా అంట"

లోపల్నుంచొచ్చిన శంకరయ్య గుమ్మం ముందున్న జనాన్ని పిచ్చిగా చూశాడు.

"ఆయన మనిషికాదు బాబూ. అందుకే ఈ మనుష్యుల్లో వుండలేక వెళ్ళిపోయారు"

రెండు చేతుల్తో మొహాన్ని దాచుకుని భోరుమని ఏడ్చేశాడు.

వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తూనే వుంది సిస్టర్! ❊



తాడిమళ్ళ రామకృష్ణ

మినీకథ

# భార్య

రాత్రి పది గంటలవుతోంది.

మొదటి ఆట సినిమా కూడా వదిలేశారు.

'నాన్న వచ్చేస్తే బావుండును!'

మరోసారి అనుకుంది మంజుల-మనసులో.

నాన్న ఇంటికి రాగానే జరగబోయే బీభత్సం తనకి తెలియంది కాదు!

రోజూ జరిగే భాగోతమే అది!

అయినా తను ఆ చిటపటలకు అలవాటు పడలేదు.

రానురానూ అమ్మకి మరీ మతి పోతోంది.

'పాపం! తెల్లవారకుండానే లేచి ఫైళ్లలో మునిగిపోతారు నాన్న. ఆ తర్వాత హడావిడిగా ఆఫీసుకు పరుగెత్తారు. సాయంత్రం వరకూ తల త్రిప్పటానికక్కూడా తీరిక వుండని పనిట—ఆఫీసులో.

సాయంత్రం అవగానే క్లబ్‌కి వెడతారు నాన్న.

అదయినా రిలీఫ్ కోసం—ఆ ఫైళ్ళ నుంచి! ఆ టెన్షన్ నుంచి! ఆ చిరాకుల నుంచి ఆ రొటీన్ నుంచి!

ఈ మాత్రానికే అమ్మ నానా రభసా చెయ్యాలా!

పాపం నాన్న ఎంత సర్ది చెప్పినా వినదు-

తన మొండి తనం తనదే!

తన వితండ వాదం తనదే!

తనకు నాన్నని చూస్తే జాలి.

అర్థం లేకుండా—

అర్థం చేసుకోకుండా—

అమ్మ అలా నాన్న మీద విరుచుకు పడటం, అందునా ఎదిగిన పిల్ల ముందు కీచులాడటం—

ప్చ్.........

మంజుల మనసు మండి పోతూంటుంది—తల్లి మీద.

* * * *

మంజుల మండి పడుతోంది—

ఆఫీసు అవగానే ఇల్లు చేరని భర్త మీద.

రాత్రి ఏ పదవుతేనోగానీ గూటికి చేరని రామారావు మీద.

'ఆఫీసు గొడవల్నుంచి, ఇంటి సమస్యల నుంచి కొంచెం రిలీఫ్ కావాలే మంజూ! అందుకే ఆఫీసు అవగానే క్లబ్‌లో స్నేహితులతో సరదాగా గడిపి వస్తుంటాను.

ఇంత మాత్రానికే నువ్వు గొడవ చేస్తే ఎలా!'

బ్రతిమాలుతున్నాడు రామారావ్.

"ఆహాహా....రిలీఫ్‌ట రిలీఫ్! ఇక్కడ ఇంట్లో ఒక్కత్తినే చావాలి కాబోలు. అసలు ఇప్పుడు మాత్రం ఇంటికెందుకొచ్చారు? వెళ్ళి ఆ రిలీఫ్ క్యాంప్‌లోనే వుండండి." ఆవేశంగా అరిచింది మంజుల.

ఆ సమయంలో ఆమెకి తన చిన్నతనం గుర్తులేదు. ❊